క్లుప్తంగా

పడుచూరి వెంకటేశ్వర్లు విగ్రహావిష్కరణ



అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి వాసవి నిత్యాన్నదాన వానప్రస్థాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు పడుచూరి వెంకటేశ్వర్లు విగ్రహాన్ని ఆశ్రమంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘ నాయకులు, వ్యాపారులు ఆవిష్కరించి, నివాళులర్పించారు. పడుచూరి వెంకటేశ్వర్లు 2022 నవంబరులో మరణించారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా, గుంటూరు మిర్చియార్డు చైర్మన్‌గా పనిచేశారు. ప్రఖ్యాత పుణ్యక్షేత్రమై అమరావతిని సందర్శించే ఆర్యవైశ్య యాత్రికులకు భోజనం, వసతి కల్పించటానికి రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి విరాళాలు సేకరించారు. వాసవి నిత్యాన్నదాన వానప్రస్థాశ్రమాన్ని నిర్మారించారు.

శ్రామిక విప్లవ యోధుడు లెనిన్



అమరావతి: ప్రపంచ కార్మిక విప్లవ పోరాటాలకు స్ఫూర్తి ప్రదాత లెనిన్ అని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో లెనిన్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. సూరిబాబు మాట్లాడుతూ మార్క్సిజం సిద్ధాంతానికి అనేక మార్పులు తెచ్చి కార్మిక రాజ్య స్థాపన చేసిన గొప్ప సామ్యవాది లెనిన్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



రాజుపాలెం: మండల కేంద్రం రాజుపాలెంలో కోదండరామస్వామి రామాలయం నుంచి భక్తులు భజనలు చేస్తూ.. ఇంటింటికీ అయోధ్య అక్షింతలు ఆదివారం పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అక్షింతలు, అయోధ్య రామ మందిరం నమూన చిత్ర పటాన్ని అందజేశారు. రామాలయంలో సోమవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం వరకు భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ సభ్యులు తెలిపారు. సాయంత్రం ప్రతి గడప వద్ద తాంబూలంలో ఐదు ప్రమిదలు వెలిగించి, రామ నామ జపం చేయాలని వారు సూచించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నకరికల్లు: గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక పాత పంచాయతీ కార్యాలయంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వికసిత్ భారత్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉజ్వల యోజన ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లు, గ్రామ జల సంఘ్ ద్వారా ఇంటింటికీ రక్షిత మంచినీటి కొళాయి, పైపులైన్ల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. విస్వకర్మ యోజనతో 16 కులవృత్తుల ప్రజలకు 15 రోజుల వృత్తి శిక్షణ అనంతరం రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు వృత్తికి సంబంధించిన సామగ్రి అందజేస్తారని చెప్పారు. పలు కేంద్ర సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరసా అంజమ్మ, పీహెచ్‌సీ డాక్టర్ మణికంత, ఏఓ కె.దేవదాసు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రత్నబాబు, హౌసింగ్ ఏఈ రాములు నాయక్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ రమీజున్, ఇందిరక్రాంతి పథం కో–ఆర్డినేటర్ ద్వారక పాల్గొన్నారు.

నొప్పులకు ఫిజియోథెరపి శ్రేష్టం

అమరావతి: స్థానిక అమ్మ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఆదివారం ఉచిత ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. ప్రభుత్వ వైద్యాధికారి శ్రీధర్ చంద్ ప్రారంభించారు. శ్రీధర్ చంద్ మాట్లాడుతూ ప్రజలు పెయిన్ కిల్లర్స్ వాడటం వల్ల వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ నివారణకు ఫిజియోథెరపీ మంచిదన్నారు. ఫిజియోథెరపీ అవగాహన పెంచుకోవాలన్నారు. ఫిజియోథెరపి డాక్టర్ సయ్యద్ అల్లా బక్ష్ కండరాలు, కీళ్ల నొప్పుల సమస్యలతో బాధపడే 30మందికి వైద్యం అందించారు. వారికి సలహాలు, సూచనలు చేశారు. వైద్యులు రాజశేఖర్, శివ, త్రివేణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

- ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు
- ఈ నెల 24 నుంచి నియోజకవర్గస్థాయి పోటీలు
- అర్హత సాధించిన 10 జట్లు
- గెలుపే లక్ష్యంగా సాగుతామంటున్నా క్రీడాకారులు



క్రికెట్ పోటీల్లో గెలుపొందిన పాత సాలిపేట జట్టు క్రీడాకారులతో ప్రజాప్రతి నిధులు, అధికారులు

సత్తెనపల్లి: స్వతంత్ర భారతదేశ చరిత్రలోనే క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించడం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం లోనే జరుగుతోంది. 'ఆడుదాం ఆంధ్రా' ద్వారా సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. గ్రామీణ యువతలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలను ప్రభుత్వం చేపట్టింది. గత నెల 26 నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, క్రీడాకారులు ప్రతి ఒక్కరూ ఈ పోటీల్లో భాగస్వాములయ్యారు. సత్తెనపల్లి పట్టణంలో 15 వార్డు సచివాలయాలు, గ్రామీణంలో 19 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 34 సచివాలయాల పరిధిలో 7,752 మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. సత్తెనపల్లి పట్టణంలో 3,420 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా వీరిలో బాలురు 1,710, బాలికలు 1,710 మంది ఉన్నారు. మండల పరిధిలో 4,332 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా బాలురు 2,166, బాలికలు 2,166 మంది ఉన్నారు. సచివాలయ స్థాయిలో పట్టణంలో 150 జట్లు, సత్తెనపల్లి మండలంలో 190 జట్లు గెలుపొందాయి. ఈ నెల 10 నుంచి మండల స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో పది జట్లు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధించాయి. వీరు నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిస్తే ఈ నెల 31 నుంచి ప్రారంభం కానున్న జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అవుతారు. ఈ క్రమంలో నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు క్రీడాకారులు తర్ఫీదు పొందుతున్నారు. ఈ క్రమంలో విజేతలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



నేను ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. నాకు బ్యాడ్మింటన్ అంటే ఎంతో ఇష్టం. ప్రభుత్వ నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' బ్యాడ్మింటన్ పోటీల్లో నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ స్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు చేస్తున్న ఈ ప్రయత్నం ఎంతో అభినందనీయం.

– ఆర్. దివ్యశ్రీ, క్రీడాకారిణి, కంకణాలపల్లి.

నియోజకవర్గస్థాయికి అర్హత సాధించా



నేను బీటెక్ చదువుతున్న. మా క్రికెట్ జట్టు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీయాలనే ప్రభుత్వ ఉద్దేశం చాలా బాగుంది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రీడలను ప్రోత్సహించడంతో నాకు ఈ అవకాశం దక్కింది.

– హరిబాబు, క్రీడాకారుడు, సత్తెనపల్లి టౌన్

క్రీడల్లో రాణిస్తాననే నమ్మకం ఉంది



క్రీడలు అంటే నాకు ఎంతో ఇష్టం. వాలీబాల్ ఎక్కువగా ఆడతాను. ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో గ్రామీణ యువతలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించడంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నా. మా జట్టు క్రీడాకారులంతా ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.. ప్రభుత్వం ఇచ్చిన అవకాశంతో క్రీడల్లో రాణిస్తాననే నమ్మకం మరింత పెరిగింది. – శివ కృష్ణ, క్రీడాకారుడు, గుడిపూడి.

శ్రీరాముని జెండాల పంపిణీ



శ్రీరాముని శోభాయత్రలో భక్తులు



జెండాలను చూపిస్తున్న భక్తులు

కారెంపూడి: అయోధ్యలో శ్రీరాముని దివ్య విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం పురస్కరించుకుని స్థానిక శ్రీ చక్ర సిమెంట్స్ కాలనీలో ఆదివారం సాయంత్రం శ్రీరాముని శోభాయాత్ర వైభవంగా జరిగింది. శ్రీరాముని చిత్ర పటంతో విశ్వహిందూ పరిషత్ కారెంపూడి శాఖ ప్రతినిధులు కాలనీ వాసులతో కలసి శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరాముని జెండాలను పంపిణీ చేశారు. ఇదిలా ఉంటే కారెంపూడి చాలా గడపలకు జై శ్రీరామ్ నినాదాలను గోడలపై ముద్రించారు. ప్రతి గడప అయోధ్య రాముని నామస్మరణతో పులకించిపోతున్నాయి. అందరూ కూడా తమ ఇళ్లను శుభ్రం చేసుకుని శ్రీరామ నామ జపంలో తరించిపోతున్నారు.

ప్లాస్టిక్ నివారణపై అవగాహన



కలుపు మొక్కలు తొలగించిన విద్యార్థినులు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారి పాలెం గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు ఆదివారం ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉషారాణి ప్లాస్టిక్ సంచులు బదులు ప్రతి ఒక్కరూ గోనె సంచులు వాడాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత–మన భద్రత నినాదాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే ఇంటి పరిసరాలు, పొలాల్లో ఉండే వయ్యారిభామ కలుపు మొక్కల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఇళ్ల మధ్య ఉన్న కలుపు మొక్కలను తొలగించారు.



నాటు వేయడానికి దమ్ము చేస్తున్న ట్రాక్టర్

రబీలోనూ వరి సాగు



సాగర్‌కు నీరు రాక పోవడంతో టీడీపీ హయాంలో పల్నాడుకు వరుసగా నాలుగేళ్లు కరువు వచ్చింది. మాగాణి కూడా బీళ్లు అయ్యాయి. కనీసం తాగడానికి నీరు దొరకని పరిస్థితి. కాని నేడు సాగర్ కాల్వల ద్వారా నీరు రాకున్నా భూగర్భ జలాలు బాగా ఉండడంతో రైతులు పంటల సాగులో బిజీగా ఉన్నారు. బోర్ల కింద రబీలో వరి నాట్లు వేయడానికి కారెంపూడిలో రెతులు పొలాలను దమ్ము చేస్తున్నారు. సాగర్ కాల్వలకు నీరు రాకున్నా భూగర్భ జలాలు బాగుండడంతో పంటల సాగు ప్రస్తుతం సవ్యంగా సాగుతోంది. అందుకే వీలైనంతలో రబీ వరి సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. రబీలో కూడా మండలంలో 900 ఎకరాలలో సాగయ్యే అవకాశం కన్పిస్తోంది.

– కారెంపూడి

అనుమానాస్పదంగా మహిళ మృతి



సత్తెనపల్లి: అనుమానస్పదంగా మహిళ మృతి చెందిన ఘటన వావిలాలు స్మృతి వనం ఎదుట కాలనీలో ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన మాటూరి మరియమ్మ (50) ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించింది. ఆమె భర్తతో విడిపోవడంతో కొంత కాలం తర్వాత దాస్ అనే వ్యక్తిని వివాహం చేసుకొని జీవనం జీవిస్తున్నారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు భర్త దాసు చెబుతున్నప్పటికీ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని పట్టణ సీఐ పి. ప్రభాకర్ రావు, పట్టణ ఎస్ఐ రఘుపతి, సిబ్బంది సందర్శించి పోస్టు మార్టం నిమిత్తం ఏరియా వైద్యశాల తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సాంస్కృతిక పోటీలకు ఆహ్వానం

క్రోసూరు: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 25న గురువారం క్రోసూరులోని జెడ్పీ పాఠశాల ఖుదా వన్ కళా వేదిక నందు పెదకూరపాడు నియోజకవర్గం స్థాయి విద్యార్థులకు, మహిళలకు సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు శ్యాంసన్ మిత్ర మండలి గౌరవ అధ్యక్షుడు శిఖా శ్యాంసన్ ఆదివారం తెలిపారు. దేశభక్తి పాటల నృత్య పోటీలకు విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. పాల్గొన దలచినవారు ఈ నెల 24వ తేదీ లోపల తమ పేర్లను 98490 66412కు కాల్ చేసి నమోదు చేసుకోవాలన్నారు.

సమగ్రంగా కులగణన సమాచారం నమోదు



గురజాలలో కులగణన సర్వేలో వలంటీర్, సచివాలయ సిబ్బంది

గురజాల : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో సమగ్ర సమాచారం నమోదు చేయాలని ఎంపీడీవో ఆర్ ఫణికుమార్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో చేపడుతున్న కులగణన సర్వే కార్యక్రమాన్ని ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సెక్షన్–1లో ఉన్న 14 అంశాలను సక్రమంగా తెలుసుకుని నమోదు చేయాలన్నారు. కులగణన వలన ఎవరికి నష్టం ఉండదన్నారు. సంక్షేమ ఫలాలు నిలిచిపోవన్నారు. కేవలం కులాల వారీగా జనాభా సంఖ్యను తెలుసుకునేందుకు గణన చేపట్టడం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో కులగణన సర్వే ముమ్మరంగా జరుగుతుంది. వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది కులగణనలో పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో ఎస్సీ కాలనీలో వృద్ధులకు, వితంతువులకు డప్పు, జానపద కళాకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆదిరాల ఆదాం ఆధ్వర్యంలో ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల సంఘాల ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో దళితులు గర్వంగా తలెత్తుకొని తిరుగుతున్నారంటే అది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి వల్లనే అన్నారు. ఈ నెల 19న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన నేపథ్యంలో దళిత మహిళలు, వృద్ధులు, వితంతువులకు చీరలు పంపిణీ చేయటం జరిగిందన్నారు. అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఆయన దయ వల్లనే దళిత బహుజనులు ఎదుగుతున్నారన్నారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం పల్నాడు జిల్లా సెక్రటరీ అల్లి వెంకట్రావు, దాసరి దేవదాసు, చర్మకారుల ప్రెసిడెంట్ కుమార్, డేగల ఉల్లయ్య, తలారి దాసు, పేరుపోగు చిన్న రోశయ్య, మీసాల కాశయ్య, తాళ్ళూరి ఏసమ్మ, పేరుపోగు మార్తమ్మ, దొరగొడ్ల దానమ్మ, దాసరి ఏసమ్మ తదితరులున్నారు

ఆర్థిక సాయం అందజేత

దాచేపల్లి : చిత్తూరు జిల్లాలో హత్యాచారానికి గురై మృతిచెందిన బాలిక కుటుంబానికి వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బత్తుల బయ్యన్న ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో బాలిక కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థికసాయాన్ని ఆయన అందించారు. బాలిక కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు.

24న పిడుగురాళ్లలో మినీ జాబ్ మేళా

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ వారి ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ మినీ జాబ్ మేళాను ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు తెలిపారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు పిడుగురాళ్ల పట్టణంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాను పరిసర ప్రాంత యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ జాబ్ మేళాలో మూడు కంపెనీలు పాల్గొంటున్నాయని, హెటిరో డ్రగ్స్, పేటీఎం, ఇన్నోవా సోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు హాజరు కానున్నట్లు తెలిపారు. సుమారు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఇంటర్, బీటెక్, డిప్లమా, ఫార్మసీ, పీజీ, డిగ్రీ చదువుకున్న 18 నుంచి 30 సంవత్సరాల లోపు వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ నకలు, పాస్‌పోర్టుసైజు ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9492158193,7842747682 నెంబర్లను సంప్రదించాలని

జనాభా ఆధారిత కుల గణన చారిత్రాత్మకం



భట్లూరులో బయోమెట్రిక్ వేస్తున్న మహిళ



బొల్లవరంలో కులగణన సర్వే

సత్తెనపల్లి: జనాభా ఆధారిత కుల గణన చారిత్రాత్మక నిర్ణయమని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ అన్నారు. మండలంలో జరుగుతున్న కులగణను ఆదివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనలో సెక్షన్–1 లో ఉన్న 14 అంశాలను సమగ్రంగా తెలుసుకొని నమోదు చేయాలన్నారు. కులగణనతో ఎటువంటి నష్టం ఉండదని, సంక్షేమ పథకాలు ఆగిపోవని తెలిపారు. అపోహలు వీడాలన్నారు. కేవలం కులాల వారీగా జనాభా సంఖ్యను తెలుసుకునేందుకే గణన చేపడుతున్నట్లు చెప్పారు. కులగణనలో ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తలు పాటించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నందిగామ పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు తదితరులు ఉన్నారు.

వేగంగా కులగణన సర్వే

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను ఆదివారం కులగణన సర్వే చేపట్టారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బృందాలుగా ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేశారు. ఇంటి యజమాని లేకుంటే కుటుంబ సభ్యుల్లో ఒకరి వేలిముద్రను సేకరిస్తున్నారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ సర్వే ప్రక్రియ కొనసాగుతుందని తహసీల్దారు ఎం.భవానిశంకర్ తెలిపారు. ఈ సర్వే ద్వారా సమాజిక వర్గాల వారీగా వివరాలు నమోదు చేస్తారని, పేదలకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

నేడు మల్లాది వెంకటేశ్వరుని తిరునాళ్ల



వెంకటేశ్వర స్వామి మూలవిరాట్‌కు పంచామృత స్నపన

అమరావతి: మల్లాది గ్రామంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శ్రీ వటవృక్షాంతర్గత వెంకటేశ్వరుని కల్యాణోత్సవం సోమవారం కనుల పండువుగా నిర్వహించనున్నారు. ఈ ఏడాది 47వ వార్షికోత్సవ తిరునాళ్లను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు యేలూరి సీతారామయ్య, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం సీతారామయ్య మాట్లాడుతూ స్వామివారి దర్శనానికి తాత్కాలిక క్యూ లైన్‌లు ఏర్పాటు చేసి, ఉచిత ప్రసాదం, తాగునీరు వసతి కల్పిస్తున్నట్లు చెప్పారు. పారిశుద్ధ్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. కల్యాణోత్సవానికి వచ్చిన భక్తులందరికీ అన్నసంతర్పణ ఏర్పాటు చేసి, ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమరావతి వాసవీ మహిళా మండలి విష్ణు సహస్ర నామ పారాయణం, స్వామివారికి తులసీదళ సేవా నిర్వహిస్తున్నామన్నారు. పరుచూరి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం స్వామికి పెద శేషవాహనంపై వైభవంగా గ్రామోత్సవం, పవళింపు సేవ నిర్వహిస్తామన్నారు. అన్నమాచార్య కీర్తనలు, నందిగామ సీతారామాంజనేయ భజన బృందం, అభయాంజనేయ భజన బృందం భక్తి గీతాలు, మల్లాది గ్రామం వెంకటేశ్వర బాల భక్త సమాజం కోలాట ప్రదర్శన ఉంటాయని చెప్పారు. వేడుకలలో భక్తులు పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

కల్యాణోత్సవంలో భాగంగా..

ఆదివారం వెంకటేశ్వరునికి నవ కలశ పంచామృత స్నపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి వినుకొండ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో నవ కలశారాధన చేసి, మూల విరాట్‌కు పంచసూక్తయుత పంచామృత స్నపన నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పర్చూరి శ్రీనివాసాచార్యులు ఉత్సవ మూర్తులకు వట వృక్షం వద్ద స్నపనను గ్రామస్తులు తీసుకు వచ్చిన కృష్ణానది జలాలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పణ



పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న సాయి, గాయత్రి సేవా సంఘం సభ్యులు

పిడుగురాళ్ల: అయోధ్యలోని రామాలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం పురస్కరించుకొని పిడుగురాళ్ల పట్టణ సమీపంలోని కొండమోడు వద్ద వేంచేసియున్న రామాలయంలోని సీతరాములకు ఆదివారం పట్టు వస్త్రాలను సమర్పించారు. పట్టణంలోని 2వ వార్డులో సాయి, గాయిత్రి సేవా సంఘాల ఆధ్వర్యంలో సీతరాముల చిత్రపటంతోపాటు నూతన పట్టు వస్త్రాలతో ర్యాలీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి కాలి నడకన కొండమోడు సమీపంలోని రామాలయం వద్దకు చేరుకున్నారు. రామాలయంలో సీతరాములకు పట్టు వస్త్రాలను సమర్పించారు. సోమవారం అయోధ్యలో ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని రామాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ కొక్కెర శ్రీనివాసరావు దంపతులు, 3వ వార్డు కౌన్సిలర్ రొక్కం అనంతలక్ష్మీతోపాటు, సాయి, గాయిత్రి సేవా సంఘం నాయకులు, సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అలనాటి ఆనందాలతో..



విజయపురిసౌత్‌లోని మాతాసరోవర్ రిసార్ట్స్‌లో కలుసుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

- 40ఏళ్ళ తరువాత మిత్రుల కలయిక
- తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్న స్నేహితులు

విజయపురిసౌత్: సుమారు 40 ఏళ్ల క్రితం ఆడిపాడారు. ఆ తరువాత విడిపోయారు. సుదీర్ఘ జీవన ప్రయాణంలో విభిన్నదారుల్లో సాగి వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపారాల్లో రాణించారు. జీవితం యాంత్రికమైపోయింది. మనసులో ఏదో తెలియని వెలితి అందరిని పట్టి పీడించింది. మూలమేదో గుర్తించారు. ఒక్కసారి చిన్ననాటి స్నేహితులను కలుసుకోగలిగితే చాలు అనుకున్నారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న సుమారు 26 మంది చిరునామాలను సేకరించారు. 1984–85 10వ తరగతి బ్యాచ్ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం విజయపురిసౌత్‌లోని మాతాసరోవర్ రిసార్ట్స్‌లో తిరిగి కలుసుకొని ఒకే వేదికపై చేరుకున్నారు. ఒక్కసారిగా అందరిలో ఉద్వేగం అపురూపమైన ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పర పలకరింపులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ ఉన్నతికి దోహద పడిన ఆనాటి గురువులను గుర్తు చేసుకున్నారు. అపురూపమైన తమ స్నేహబంధానికి గుర్తుగా గ్రూప్ ఫోటోలు దిగారు. తమ తోటి విద్యార్థులు కలిసేందుకు అందరి చిరునామాలు సేకరించి ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు కృషి చేసిన వెంకటరమణి, విజయ, అహ్మద్‌ఖాన్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

(సత్తెనపల్లి, పెదకూరపాడు)

99516 02950

Office mail : sakshigntadvt@gmail.com